క్లుప్తంగా

పండ్లతోటల పరిశీలన

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో సే ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పండ్ల తోటలను సే ట్రీస్ ప్రతినిధి అనురాగ్ బుధవారం పరిశీలించారు. సుంకన్న అనే రైతు తన నాలుగు ఎకరాల పొలంలో చీని తోటను పెంచుతున్న విధానాన్ని, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండ్లతోటల పెంపకాన్ని చేపట్టాలని కోరారు. అనంతరం నవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పత్తికొండ, తుగ్గలి మండలాల్లో జరుగుతున్న పండ్ల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ప్రోగ్రామ్ మేనేజర్ బి.నారాయణ, అసోసియేషన్ సీఈఓ నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా సాదాకలి ఉరుసు


గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని నెరణికి గ్రామంలో వెలసిన సాదాకలి తాతా ఉరుసులో భాగంగా బుధవారం తెల్లవారుజామున గంధం, ఆ తర్వాత ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. తాత సమాధిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున గంధం పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేరడంతో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. గురువారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుంది.

ఆర్థిక చేయూత

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా పుచ్చకాయలమాడలో రెండు కుటుంబాలను ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అందులో భాగంగా తలారి గంగమ్మ చిన్న కుమారుడు అశోక్‌కుమార్‌కు ఎలక్ట్రిక్ ఆటో, అదే గ్రామానికి చెందిన మరో మహిళ కవిత భర్త రాముడు వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ కింద రూ.లక్ష ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్‌కు అందించేందుకు రూ.3.8 లక్షల విలువ చేసే ఆటోను కొనుగోలు చేశారు. అలాగే కవిత భర్తకు రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు. అశోక్ కుమార్‌కు ఆటోను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో అందజేశారు.

అడిగిన వారందరికీ పని కల్పిస్తాం

చిప్పగిరి: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని ఏపీఓ మాదవ శంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని బంటనహాలు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు లేని వారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ప్రమీళ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆస్పరి: పుటకలమర్రి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షమీల, పీఈటీ రాముడు బుధవారం తెలిపారు. ఇటీవల కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -17-19 విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభ కనబరచారు. సెకండియర్ బైపీసీ చదువుతున్న వెంకటేష్ 1500, 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం నిలిచి బంగారు పథకం గెలుపొందారు. సెంకడియర్ సీఈసీ విద్యార్థి శివశంకర్ 3 కి.మీ. పరుగు పందెంలో మొదటి స్థానం, సెంకడియర్ సీఈసీ విద్యార్థిని గిరిజ 3 కి.మీ. పరుగు పందెంలో మొదటి స్థానం, 10వ తరగతి ఉషా లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, సెకండియర్ బైపీసీ మంజులు హ్యామర్ త్రోలో మొదటి స్థానం, 10వ తరగతి లక్ష్మీ జావెలిన్ త్రోలో మొదటి స్థానం, 7వ తరగతి శివ ట్రియథలిన్‌త్రోలో మొదటి స్థానం, ఫస్టియర్ ఎంపీసీ ప్రియాంక హ్యామర్ త్రోలో మొదటి స్థానం, 9వ తరగతి గీతాంజలి 400 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం, 7వ తరగతి హేమలత 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం, సెకండియర్ అనిత డిస్కస్ త్రోలో మొదటి స్థానం, దేవి 100 మీటర్ల హర్డిల్‌లో మొదటి స్థానం, 9వ తరగతి శైలజ 400 మీటర్ల హర్డిల్‌లో మొదటి స్థానంలో నిలిచారు. ఫస్టియర్ ఎంపీసీ స్రవంతి, 9వ తరగతి భానుశ్రీ స్విమింగ్‌లో మొదటి స్థానం నిలిచారు. వీరంతా.. ఈనెల 6వ తేదీన రాజమండ్రి, ఈనెల 22న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ వివరించారు.

సమగ్రశిక్షకు నిధులు విడుదల చేయాలి

ఆలూరు: సమగ్ర శిక్షకు సంబంధించి ఒకే సారి వార్షిక బడ్జెట్ కేటాయించి నిధులు విడుదల చేయాలని జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు సమగ్ర శిక్ష రాష్ట్ర జేఏసీ కో చైర్మన్ మహమ్మద్ రఫీ, జిల్లా జేఏసీ నేతలు వినతి పత్రాలు సమర్పించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీ జయంతి నిర్వహించారు.

ఫోర్‌లైన్‌కు మోక్షమెన్నడో?

- ఆదోని – గుత్తి రోడ్డును విస్తరించాలని ఏళ్లుగా డిమాండ్
- నిత్యం రద్దీతో వాహనదారుల అవస్థలు
- ప్రభుత్వం స్పందించాలంటున్న ప్రజలు


రాతన వద్ద చెరువుకట్టపై ఇరుకు రహదారి


తుగ్గలి రైల్వే అండర్ బ్రిడ్జిలో లారీ అవస్థలు (ఫైల్)


రాతన చెరువులో అదుపుతప్పి పడిపోయిన లారీ (ఫైల్)

తుగ్గలి : ఆదోని–గుత్తి ప్రధాన రహదారి రద్దీగా మారింది. ఏళ్లుగా ఈ రోడ్డు ఫోర్ లైన్‌కు మోక్షం కలగడం లేదు. నిత్యం వందలా వాహనాలు తిరుగుతుంటాయి. మంత్రాయం పుణ్యక్షేత్రానికి కర్ణాటక భక్తులు ఈ మార్గంగా గుండా వెళ్లాల్సి రావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. రద్దీకి తగ్గట్టు రోడ్డు వెడల్పు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదాలు నిత్యకృత్యం..

గుత్తి నుంచి పత్తికొండ మీదుగా ఆదోని వెళ్లే ప్రధాన రోడ్డు వెడల్పునకు నోచుకోక పోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఫోర్‌లైన్ మంజూరైందని గత కొన్నేళ్లుగా చెబుతున్నా.. ఇంత వరకు ఆచరణకు నోచుకోలేదు. ఈ మార్గం గుండా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణ వాహనాలతో పాటు భారీ వాహనాలు వెళ్తున్నాయి. కాగా..ఇటీవల కాలంలో మంత్రాలయం వెళ్లే కర్ణాటక భక్తుల సంఖ్య పెరగడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. మార్గమధ్యలో ఉన్న రాతన, జొన్నగిరి చెరువు కట్ట, గిరిగెట్ల వద్ద వంతెన ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో అదుపుతప్పి వాహనాలు చెరువులు, వాగులో పడిపోతున్నాయి. నాలుగు నెలల క్రితం గిరిగెట్ల సమీపంలోని వంతెన వద్ద బెంగళూరుకు చెందిన కారు వాగులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న నలుగురిని కాపాడడంతో ప్రమాదం తప్పింది. రాతన, జొన్నగిరి చెరువుల్లో పలుమార్లు వాహనాలు పడిపోయాయి. దీనికి తోడు ఎన్నోళ్ల క్రితం నిర్మించిన తుగ్గలి రైల్వే బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో వాహనాలు వెళ్లలేక ఫర్లాంగ్ దూరం రివర్స్‌లో వెనక్కి రావాల్సి వస్తోంది. ఈ సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేళ్లకు పైగా ఫోర్‌లైన్ అంటూ ప్రచారం జరుగుతున్నా నెరవేరకపోవడంతో అవస్థలు తప్పడంలేదు.

ఫోర్‌లైన్ సమాచారం లేదు

ఫోర్‌లైన్ ప్రతిపాదన అంటూ ఇంత వరకు ఏమీ లేదు. పత్రికల్లో మాత్రమే ఫోర్‌లైన్ మంజూరైందని వార్త వచ్చింది. ఇందుకు సంబంధించి తమ శాఖకు ఎలాంటి సమాచారం లేదు. ఫోర్‌లైన్ మంజూరైతే.. పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మిదేవి, ఆర్అండ్‌బీ ఏఈ, తుగ్గలి

ఇరుకు రోడ్డుతో ప్రమాదాలు



రాతన, జొన్నగిరి చెరువ కట్ట, గిరిగెట్ల వద్ద వంతెన మీద రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనేకమార్లు వాహనాలు చెరువుల్లో పడిపోయాయి. కట్టలు వెడల్పు చేయడంతో పాటు ఈ రోడ్డును ఫోర్‌లైన్‌గా మార్చి ప్రాణాలు కాపాడాలి.

– పులికొండనాయక్, జెడ్పీటీసీ సభ్యుడు, తుగ్గలి

వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది



గుత్తి–ఆదోని రోడ్డు మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. మంత్రాలయానికి వెళ్లే కర్ణాటక వాహనాలతో శుక్ర, శని, ఆదివారల్లో ఈ రద్దీ రెట్టింపు అవుతుంది. వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చొరవ చూపి ఫోర్‌లైన్‌గా మార్చి ప్రమదాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

– చాంద్‌బాషా, మండల కో ఆప్షన్ సభ్యుడు, రాతన

ఉత్సవాలకు వేళాయె

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు


ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి

పత్తికొండ(తుగ్గలి) : ఆది పరాశక్తిగా కొలిచే శ్రీ దేవీ శరన్నరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభకానున్నాయి. ఇందుకోసం పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ఆలయ కమిటీలు, మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ప్రారంభమయ్యే వేడుకలు ఈనెల 14వ తేదీతో ముగుస్తాయి. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారికి ఈ తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవరాత్రుల వేడుకలు నిర్వహించినా, అమ్మవారికి పూజలు చేసినా పది జన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాల్లో అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారిని ఆరాధించడం వల్ల సంపద పెరుగుతుందని వేద పండితులు పేర్కొంటున్నారు. ఉత్సవాల్లో అమ్మవారికి రోజుకో రూపంలో అలంకరించి, అమ్మవారికి ఇష్టమైన పూలు, నైవేద్యం సమర్పిస్తారు. వేడుకల్లో భాగంగా నేటి నుంచి పత్తికొండ పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అమ్మవారి అలంకరణలు ఇలా..

3న శ్రీ రాజరాజేశ్వరీ దేవీ అలంకరణలో, 4న మహాలక్ష్మీదేవిగా, 5న గాయత్రీదేవిగా, 6న అన్నపూర్ణాదేవిగా, 7న పార్వతీదేవిగా, 8న గజలక్ష్మీదేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్ధనీ దేవిగా, 12న విజయదశమి రోజు శమీ పూజ, 13న ప్రత్యేక పూజలు, 14న వసంతోత్సవం, గ్రామోత్సవం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు వివరించారు.

దేవనకొండ: స్థానిక దేవనకొండ సుంకులా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభిస్తున్నామని భక్తులు బుధవారం తెలిపారు. ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు అమ్మవారిని వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. ప్రతిరోజూ సాయంత్రం దేవలయం వద్ద అమ్మవారి విశిష్టత, దసరా ఉత్సవాల గురించి ప్రవచనాలు ఉంటాయని చెప్పారు.

నూతన మద్యం పాలసీతో జీవితాలు నాశనం


పత్తికొండలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఐ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : పచ్చని కుటుంబాలను నాశనం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలు చేస్తోందని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు చంద్రమ్మ మండి పడ్డారు. నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా బుధవారం పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా పట్టారు. వారు మాట్లాడుతూ.. మద్యం విచ్చల విడిగా తాగండి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రైవేటు వ్యాపారులకు లాభాలు చేకూర్చేందుకు నూతన మద్యం పాలసీ తీసుకొచ్చారన్నారు. మద్యం ధరలు తగ్గించినట్లే నిత్యావసర సరుకుల ధరలు ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. నిత్యావసర సరుకులు, వంట నూనెల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, మహిళా సమాఖ్య నాయకురాలు విజయలక్ష్మి, భారతి, హసీనా, సుశీల, సుంకమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మద్దికెర : మండల కేంద్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహా మంగళహారతి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.


పూజలందుకున్న మారెమ్మవ్వ

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత, తంగరడోణలో చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి, కైరుప్పలలో వీరభద్ర స్వామి ఆలయాల్లో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు రూపామోహన్ శర్మ, శాంతిరెడ్డి ఆధ్వర్యంలో గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు.

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి, హొళగుంద శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో అమావాస్య సందర్భంగా బుధవారం అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. హొళగుందలోని సాయిబాబా మందిరం, చిణిగి తాత, ఎల్లార్తి షేక్షావలి, షాషావలి, హొళగుంద సాయిబన్న దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.



హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో కొలువైన గాదిలింగేశ్వరస్వామి వారికి బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని టోపీ మారెమ్మవ్వ, క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుప్రీం కోర్టు వాఖ్యలు.. బాబుకు చెంపపెట్టు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తిరుమల లడ్డూ వివాదంపై చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వ్యాఖ్యానించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ..ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయలేకే చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. మత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం కుట్ర చేసిందని, దానిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా తిప్పికొట్టడంతో డిక్లరేషన్ పేరిట నానాయాగీ చేసిందన్నారు. జగనన్న సంధించిన ప్రశ్నలే ఇప్పుడు ధర్మాసనం సైతం ప్రస్తావించడంతో బాబు సర్కార్‌కు గొంతులో వెలక్కాయ పడినట్లయ్యిందన్నారు. విచారణ చేయకుండానే, ఏ నివేదికలు లేకుండా లడ్డూలో కల్తీ జరిగిందని ప్రకటించి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని కోర్టు ఆక్షేపించిందన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కేవలం పింఛన్ ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటూ కాలయాపనం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు, అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలోనే లబ్ధిదారులకు ఒక్కరోజులో పింఛన్ అందించామని, ఇప్పుడు మేమే అందించామని బాబు గొప్పలు చెప్పు కోవడం ఏమిటని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి చిన్న చిన్న వరాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కుట్ర రాజకీయాలకు స్వస్తి చెప్పి పథకాల అమలుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.


పత్తికొండ ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ నారాయణదాసు


పెండేకల్లులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ లీలావతి


చిప్పగిరిలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జూటూరు మారయ్య

గాంధీ మార్గం అనుసరణీయం



పత్తికొండ, ఆస్పరిలో గాంధీ చిత్రపటం, విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

పత్తికొండ(తుగ్గలి) : ప్రపంచానికి అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన గాంధీ మార్గం ఎప్పటికీ అనుసరణీయమని ఎంపీపీ నారాయణ దాసు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పలుచోట్ల గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపూ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

- **తుగ్గలిలో..**

అహింస మార్గం ద్వారా దేనినైనా సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని దేశానికి స్వాంతత్ర్యం తీసుకురావడంతో ఆయన సేవలు ఎనలేనివని ప్రజాప్రతినిధులు, అధికారులు కొనియాడారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మనీంద్ర, లీలావతి, పుష్పావతి, సౌజన్య, విజయ్, ఓబులేసు, ఎంపీటీసీ సభ్యులు రంగన్న, సింగిల్ విండోమాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ గౌరవ సలహాదారు సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

గాంధీ జయంతిన గ్రామసభలు

తుగ్గలి : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తుగ్గలి, పత్తికొండ మండలాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. సచివాలయాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన ఉపాధి పనులపై చర్చించారు.

- **చిప్పగిరి:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సీపీ. కొండయ్య,ఏపీఓ మాదవ శంకర్,సర్పంచ్ గోవింద రాజులు,రమేష్,రాజు పాల్గొన్నారు.
- **పత్తికొండ (ఆళ్లగడ్డ):** అహింస అనే ఆయుధంతో నాడు తెల్ల దొరల బానిసత్వం నుంచి దేశానికి స్వాతంత్య్రం రావడానికి కారకుడైన జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీధర్‌రెడ్డి అన్నారు.మహాత్మా గాంధీ, లాల్ బహాదూర్ శాస్త్రీ జయంతిని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో వారి చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. స్థానిక పోచంరెడ్డి సేవాదల్ కార్యాలయంలో మురళీధర్‌రెడ్డి గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **ఆస్పరి:** మహాత్మా గాంధీ 155వ జయంతిని మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి సర్పంచ్ మూలింటి రాధమ్మ, పంచాయతీ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం, కూటమి నాయకులు ఆధర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, సుధాకర్, పవన్, సుబ్రహ్మణ్యం, సూరయ్య రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, పంచాయతీ సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని బిణిగేరి గ్రామంలో జనసేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీఐ మస్తాన్‌వలి ప్రారంభించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్, సర్పంచ్ వెంకటేశ్, విరుపాక్షి స్వామి పాల్గొన్నారు.
- **మద్దికెర :** గాంధీ కన్న కలలు తీర్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచు బండారు సుహాసిని, ఆపద్బంధు సేవాసమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లో మహాత్మా గాంధీ జయంతి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఎంపీటీసీలు బండారు ఆంజనేయులు, శ్రీనివాసులు ఈఓ కరుణకుమారి పాల్గొన్నారు.


రక్తదానం చేసిన యువకుడికి ప్రశంసా పత్రం అందజేస్తున్న సీఐ మస్తాన్‌వలి

- **హొళగుంద:** స్థానిక పంచాయతీ కార్యలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ ఆధ్వర్యంలో , ఎల్లార్తి సచివాలయంలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి, వీఆర్‌ఓ ప్రహ్లాద, సచివాలయ ఉద్యోగులు గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **హాలహర్వి:** స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో బుధవారం మహాత్మాగాంధీ జయంతిని నిర్వహించారు. సిద్ధాపురం సచివాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీటీసీ గాదిలింగప్ప నివాళులర్పించారు.
- **కృష్ణగిరి :** మహాత్మాగాంధీ జయంతిని బుధవారం మండలంలోని రామళ్లకోటలో నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ నిర్మలమ్మ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌నాయక్, సచివాలయ ఉద్యోగులు, ఎంపీటీసీ సభ్యురాలు నాగలక్ష్మమ్మ, గ్రామ నాయకులు మాధవస్వామి, నాగమద్దయ్య, రమణ, బాబుగౌడ్ పాల్గొన్నారు. వెల్దుర్తిలో సత్యసాయి హైస్కూల్‌లో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని నిర్వహించారు.


ఆస్పరి పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


మద్దికెరలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


గాంధీ చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు

హొళగుంద గ్రామసభ రసాభాస


అధికారులతో వాగ్వాదానికి దిగిన వార్డు సభ్యులు

హొళగుంద: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. సభలో పలు సమస్యలు, ఇతర విషయాలపై వార్డు సభ్యుడు చిన్న మల్లయ్య ప్రశ్నించాడు. సర్పంచ్ చలవాది రంగమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభ ప్రారంభంలో ప్రశాంతంగా సాగి ఆ తర్వాత ఆగ్రహావేశాలు, నిలదీతలు, వాగ్వాదాలతో గందరగోళంగా మారింది. ప్రధానంగా వారపు సంత మార్కెట్‌కు సంబంధించి పాత బకాయిలను వసూలు నిర్లక్ష్యంపై చిన్న మల్లయ్య తీవ్రంగా మండిపడ్డారు. సంత మార్కెట్‌లో సౌకర్యాలు లేవని వ్యాపారస్తులు వాపోయారు. సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో హిందూ శ్మశాన వాటిక ఆక్రమణకు గురవుతుందని, ఎట్టి పశువులు రాత్రిళ్లు సమీప పొలాలో పడి పంటలను నాశనం చేస్తున్నాయని అరికట్టాలని, వివిధ సమస్యలను ప్రస్తావించారు. అంతకు ముందు గ్రామపెద్దలు రాజ పంపన్నగౌడ్, ప్రసాద్ తదితరులు పంచాయతీకి వస్తున్న నిధులు, అనుమతులు, ఇతర అంశాలను లేవనెత్తారు.